
# చచ్చాకేనా సహాయం?




"తీరా మీరు సమయానికి తప్పుకున్నారు. మా సేవాదళ్ వాళ్ళు అలా ఊరుకోగలరా మరి!" అంటూ తను ఊర్నించి వచ్చీ రాగానే భార్య గాయత్రి గుమ్మం లోంచే దుమ్మెత్తి పోస్తూంటే రామానికి కారం రాసినట్టయింది.

అసలే అతన్ది 'ఈగ వాలితే జోడిచ్చుకు కొట్టే' మనస్తత్వం. రోగంతో వున్న పెళ్ళాం అక్క సూరమ్మని తీసుకొచ్చి దినం తీర్చాడు. చివరి దాకా సేవ చేశాడు. ఉద్యోగ రీత్యా అవసరం వస్తే క్యాంపుకి వెళ్ళాడు. ఇంతలో ఆవిడ కాలం చేస్తుందని ఎవరనుకున్నారు? ఈ వర్తమానం అర్ధం చేసుకోవాలంటే ఏడాది వెనక్కి వెళ్ళి విషయాలు సమీక్షించాలి.

ఏదో కలసి ఏకముఖంగా సంసారం ఈడుస్తున్నారుగానీ వాళ్ళిద్దరివీ ఎడముఖం పెడముఖం. తన పుట్టింటివారి విషయంలో ఏనాడూ ఆసక్తి ప్రదర్శించని తన భర్త దిక్కులేని తన రోగిష్టి అక్కకి ఆశ్రయ మివ్వగలడని గాయత్రి ఎప్పుడూ అనుకోలేదు. ఇలా తన అక్క ఇవాళ రేపో అన్నట్టువుందని తెలిసిన వాళ్ళెవరో ఓ కార్డుముక్క రాసిపారేస్తే పైకయినా వినపడకుండా ఏడుస్తూ కూచుంది. తెలివైన రామం ముందు అది దాగలేదు. ఆ కబురు విన్నాక అతన్లోని మానవత్వం తిరుగు రైల్లో ఆమెని

తీసుకొచ్చేదాకా ఆగలేదు కూడా.

గాయత్రి అక్క సూరమ్మగారు భర్తని తిట్టని రోజంటూ వుండేది కాదు గనక, చచ్చిపోయినా అతను బతికున్నట్టే లెక్క. ఆవిడ కొడుకు ఎక్కడో ఏదో విదేశంలో పెద్ద ఉద్యోగంలో స్థిరపడినా తల్లెలా వుందో ఏనాడూ పట్టించుకుని ఎరగడు, గనక వాడు బతికున్నా చచ్చినవాళ్ళతో జమ. జాగ్రత్త వున్న మనిషి గనక వంటిన వున్న బంగారం కాస్త కాస్తా కరిగించుకుంటూ ఎలాగో ఇన్నాళ్ళూ రోజులు గడుపుకొచ్చింది ఆవిడ. పెద్ద కెరటం లాంటి మధుమేహ రోగం వున్నట్టుండి ఆవిణ్ణి ముంచేసి మంచాన చేరేసింది. చెల్లెలి చేతా, మరిది చేతా చేయించుకుంటే తప్ప ఆవిడ ఆఖరి కాలం వెళ్ళింది కాదు.

అయితే తాము ఎత్తుకున్న బరువు తమనే చిత్తు చేసేదని ఆ దంపతులకు అతి తొందర్లోనే తెలుసుకొచ్చింది. మంచాన పడిన పంచదార రోగులకు సేవ చెయ్యడం కుళ్ళు కాలవ పక్కన కాపరం పెట్టినట్టు. ఆ రోగం మూత్రానికి సంబంధించింది గనక ఆ రోగులు ప్రతినిముషం పసివారిలా పక్క తడుపుతూనే వుంటారు. బ్లడ్-షుగర్ కూడా పట్టుకుంటే ఆ దుర్వాసన మరింత దుర్భరం. అయినా వ్యాధిగ్రస్త అయిన సాటి వ్యక్తిని సాకడంలో రామం ఎటువంటి అశ్రద్ధా చూపించలేదు. ప్రాక్టికల్ సెన్సు వున్నవాడు గనక ఆవిడ మెళ్ళో మిగిలిన ఆ ఒక్క గొలుసూ అమ్మేసి ఆ పదివేలూ బ్యాంకులో వేసి ఏ లోపం రాకుండా వైద్యం చేయించాడు. ప్రతి నిముషం బట్టలారేస్తూ సేవచేసే మనిషి మాత్రం నెలకి రెండొందలు యిస్తామన్నా కుదిరింది కాదు. మునుపయితే ఏమోగాని బిడ్డసంచీ తీయించేసుకున్న ఆపరేషనుతో గాయత్రి ఈ మధ్య బాగా డీలాపడిపోయింది. పిల్లా పీచూలేని గాయత్రి మొదట్నుంచీ సామూహిక భజనల్లోనూ భక్త సమాజాల సేవాదళ్‌లోనూ ప్రముఖ పాత్ర తీసుకుంటూ వచ్చేది. ఈమధ్య ఆవిడకి అక్కగారి గుడ్డలు జాడించడమే అఖండ భజన. పత్యంపానం అందిస్తూ ఇంట్లో ఇరవై నాలుగ్గంటలూ అతుక్కుపోవడమే ఆవిడ కిప్పుడు నగర సంకీర్తన 'ఇది ఇప్పట్లో చావదు. ఇక ఇంతట్లో నాకు బతుకూ లేదు' అంటూ ఏడాది దాటకుండానే అక్కకి వినపడేలాగే విసుక్కునే స్థాయికి చేరింది. పైకి అనలేదుగానీ రామం అభిప్రాయమూ అదే. మరీ ఈ మూడు నెలలై వదిన గారి మందూ ఆహారమూ చూడడమే కాకుండా ఆవిడ గుడ్డలు ఆరేసి మరీ ఆఫీసుకి వెడుతున్నాడతను. అదేదో అంటు రోగమనే మూఢ విశ్వాసంతో అక్కడి నౌకర్లు భయపడుతూంటే అతనేం చెయ్యాలి మరి!

పీకలు తెగిపోయే వారి ఈ సమస్యని కాలం ఇలా పరిష్కరించగలదని రామం కలలో కూడా అనుకోలేదు. ఆఫీసు పనిమీద అతనలా మద్రాసు వెళ్ళొచ్చేసరికి వదినగారి మరణమే కాదు, దహన సంస్కారం కూడా జరిగిపోయింది. "మా సూరమ్మక్క నిజంగా అదృష్టవంతురాలు. దాని చావు పెళ్ళిలా జరిగిదంటే నమ్మండి. ఊరు ఊరంతా ఏకమయ్యారు. ముఖ్యంగా మా సేవాదళ్ చేసిన సాయం ఈ జన్మలో మరచిపోలేను. నాకింత కష్టం వచ్చి సమయంలో మీరు ఊళ్ళో లేరని వాళ్ళంతా వచ్చి తల్లీ తోడూలా ఆదుకున్నారు. నాకు ధైర్యం చెప్పి రాత్రి తెల్లవార్లూ నాకు ఆసరాగా వుండిపోయారు. తర్వాత యివ్వొచ్చని స్వంత డబ్బు ఖర్చుపెట్టి మా సెక్రటరీగారు అన్ని పనులూ దగ్గరుండి చేయించారు. ఎక్కడా ఏ తేడా రాకుండా చూసి, శవాన్ని శ్మశానికి నడిపించి యధావిధిగా దహన సంస్కారం చేయించారు. లేకపోతే ఈ మారుమూల ఊళ్ళో దిక్కూదివాణం లేక ఏమైపోయి వుందునో!" భక్త సమాజాలూ వాటికి సంబంధించిన సేవా దళ్‌లూ ఇలాంటి సంస్థలు మీద

రామంకి సదభిప్రాయం లేదు. అయినా మంచి పని ఏ పేరున జరిగితేనేం! వెంటనే వాళ్ళ దగ్గరికి పరుగెత్తాడు. పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. వాళ్ళు ఖర్చు పెట్టింది కృతజ్ఞతతో తీర్చేయ్యడమే కాక ఆ ఆదివారం జరిగే అన్నదానపు ఖర్చు అంతాతనే భరించాడు. సమయానికి తమ లేకపోయినందుకు విచారం వెలిబుచ్చాడు. సూరమ్మగార్ని తెచ్చిపెట్టుకున్న శిక్ష అక్కడితో పూర్తి అయిందనుకున్నాడు. కాని గాయత్రి ఈ మధ్య చేస్తున్న విమర్శలు వింటూ ఎందుకు ఊరుకోవాలో అతనికి అర్థంకావడం లేదు.

అతన్ది పూర్తిగా హేతువాద తత్వం. ఆవిడది పూర్తిగా సనాతన సంప్రదాయం. 'కట్టుకున్నాం గనక తెగ్గొట్టుకోలేం గనక ఎలాగో కొట్టుకొద్దాం. అందుకే నీ జోలికి రాను. నా జోలికి రాబోకు' అని లెక్చర్లు దంచడుగానీ, అతని ఆచరణ మాత్రం అదే. "ఆ సేవాదళ్ వాళ్ళ ఋణం మనం జన్మలో తీర్చుకోలేమండీ" అని రోజుకి పదిసార్లైనా ఆవిడ గుర్తు చేస్తూంటే వింటూ ఎలా ఊరుకోవాలి! ఆవిడ పదే పదే వాళ్ళని పొగుడుతూన్న కొద్దీ "ఎందుకింతలా ప్రశంసిస్తోంది చెప్మా! నిజంగా వీళ్ళలో ఏమీలేదేమో!" అని శంకించడం మొదలెట్టింది అతని  మనసు. ఆ దృష్టితో ఆలోచించిన కొద్దీ అతని మనసు ఇంకా వెనక్కి వెళ్ళి ఏవేవో వెతక సాగింది.

ఇంటి యజమాని లేని విపత్కర పరిస్థితుల్లో ఆదుకుని, అంత భాధ్యతా నెత్తినేసుకుని ఆ భజన సమాజం సేవాదళ్ సభ్యులు  వందమందీ ఆ దహన సంస్కారం జయప్రదంగా నిర్వహించారు. ఆ మేరకు కావాలంటే యావజ్జీవం వాళ్ళ సహాయాన్ని కొనియాడుతూ వుండాల్సిందే. కాని ఆ వందమందీ కలిసి అలాంటి సాయం చేసింది ఒకే ఒక రోజున. అదైనా ఎప్పుడు? ఆ మనిషి చచ్చిపోయాక, అదే మనిషి అదే ఊళ్ళో మూడొందల అరవై అయిదు రోజుల పైగా మంచాన పడి రాత్రింబవళ్ళు  చావు బ్రతుకుల మధ్య కొట్టుకుపోయిందని ఆ వంద మందికీ తెలుసే ఒక్కడైనా ఒక్క రోజైనా వచ్చిసాయం చేయ్యలేదేం! మలమూత్రాలలో  మగ్గిపోతున్న ఓ అనాథకి ఆదుకోడానికి తమ ఇద్దరి సర్వశక్తులూ చాలక తల్లడిల్లి పోతున్నప్పుడు ఇంత మంది వున్నారు, వంతులు వారీగా వచ్చి స్నేహహస్తం అందించలేదేం! అంతకు ముందు ఏమాత్రం రాకపోకలు లేని ఓ దూరపు బంధువు రాల్ని ఏడాదిపాటు రక్తమాంసాలు హరించుకుపోయినట్టు అహర్నిశలూ ఓ బ్రతికున్న మనిషిగా అదుకుని సేవచేస్తే ఓ మంచి మాటయినా తనకి దక్కలేదే! ఇంత మంది కలిసి యీనాడు ఓ శవాన్ని సాగనంపినందుకు ప్రతీక్షణమూ సాష్టాంగ పడలా! ఏం న్యాయం యిది!

"ఏమండీ! ఏమిటాలోచిస్తున్నారు వీళ్ళ ఋణం ఏం చేసి తీర్చుకోగలమంటారు?" బోధ పడదనో చెప్పినా లాభం లేదనో రామం గాయత్రితో ఆర్గ్యుమెంటు ఏనాడో మానేశాడు. కాని ఆవిడ వేసిన ఆ ప్రశ్నతో అతను రెచ్చిపోయాడు. అన్నీ మరచిపోయాడు. "బతికున్నంత వరకే ఏమనిషితో ఏదయినా అనే నా విశ్వాసం తెలిసి మరీ నన్ను రెచ్చగొట్టేవు. సరే, నాజవాబు విను. ఈ పరిస్థితుల్లో నేను ఋణం తీర్చుకునే పద్దతి ఒకటే. మనింట్లో శవాన్ని ఆదుకున్నారు వాళ్ళు. అందుకని మనమూ సరిగ్గా అలాగే చెయ్యడమే ఋణం తీర్చుకునే పద్ధతి. ఇంకా ఏడాది సర్వీసుంది నానిక్కడ. ఈ ఏడాదిలోగా మీ వంద మంది వాలంటీర్లలో ఎవరో ఒకరు గుటుక్కు మనకపోరు. అలా జరిగిన వెంటనే తెలియజెయ్యి. దహన సంస్కార బాధ్యత వహించి ఋణం తీర్చుకుంటాను. అంతే ఈ లోగా 'ఋణం' సంగతి మరోసారి నాకు గుర్తు చేశావో ఆ క్షణమే నీ పీక నొక్కేస్తాను జాగ్రత్త!"

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,దీపావళి సంచిక,1990)*